నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, సోమవారం 10 మార్చి 2025 | JAGTIAL

## నేటి నుంచి ప్రజావాణి పునఃప్రారంభం

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 9 : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా కొద్ది వారాల పాటు రద్దు చేయబడిన ప్రజావాణిని తిరిగి నేటి నుంచి ప్రారంభిస్తున్నట్టు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రజలు నేటి నుంచి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అర్జీలను సమర్పించవచ్చని సూచించారు.

## ప్రజా భద్రతకు ప్రాధాన్యం

- నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- కరీంనగర్ సీపీ గౌష్ ఆలం
- బాధ్యతల స్వీకరణ

కరీంనగర్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తామని, నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని కరీంనగర్ నూతన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు. ఆదిలాబాద్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన, ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అభిషేక్ మొహంతి పూలమొక్క అందించారు. అనంతరం ఇద్దరు అధికారులు కాసేపు మాట్లాడుకున్నారు. తర్వాత కమిషనరేట్ పరిధిలోని నేరాలు, శాంతిభద్రతల గురించి అభిషేక్ మొహంతిని సీపీ గౌష్ ఆలం అడిగి తెలుసుకున్నారు. నూతన సీపీకి సాయుధ బలగాలు గౌరవవందనం సమర్పించగా, కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, శాంతి భద్రతలు, రోడ్డు భద్రత, పట్టణ పోలీసింగ్‌పై దృష్టిసారిస్తామని, పౌర ఆధారిత పోలీసింగ్ సేవలు పెంచుతామని చెప్పారు. పోలీసింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగిస్తామని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం కట్టుబడి ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ ఏ లక్ష్మీనారాయణ, రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్, ప్రొహిబేషనరీ ఐపీఎస్ వసుంధరయాదవ్, కమిషనరేట్‌లోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సీపీ గౌష్ ఆలం




రాయ్ చందని సింధ్ డెవలపర్స్ ప్రతినిధి భవానీకి మెమొంటో అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, డీటీసీపీ అధికారి ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకుడు బండ గోపాల్‌రెడ్డి



మహిపాల్ రెడ్డి, సుచిత్ర డెవలపర్స్ | అరుణ్ ప్రకాశ్, సుగుణ డెవలపర్స్ | అజయ్, మహా సిమెంట్ | గడ్డం ప్రశాంత్, సోనీ సోలార్ పవర్ | రాజు, కేకే ఎంటర్‌ప్రైజెస్ | అజయ్‌కుమార్, వైషు విజన్ సెక్యూరిటీస్ | విశాలాక్షి, వైష్ణవీస్ గార్డెన్ విల్లాస్



సంపత్‌కుమార్, ఎస్వీ ట్రేడర్స్, హార్డ్‌వేర్ | మెన్నేని స్వరాజ్, స్వరాజ్ బిల్డర్స్ | సోహెల్, ఉస్మాని కన్‌స్ట్రక్షన్స్ | వెంకటపతి శర్మ, ఎడ్‌వన్సా సెంచూరీ అపార్ట్‌మెంట్స్ | కరుణాకర్, సాయి శ్రద్ధ ఇన్ ఫ్రా ప్రతినిధి | రమాదేవి, శ్రీమహాలక్ష్మి ఇన్ ఫ్రా డెవలపర్స్ | బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగి




సందర్శకులకు అపార్ట్‌మెంట్ గురించి వివరిస్తున్న ప్రతినిధి




స్టాల్‌ను పరిశీలించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, డీటీసీపీ అధికారి ఆంజనేయులు




గిఫ్ట్ కూపన్ తీస్తున్న స్వరాజ్ బిల్డర్స్ యజమాని స్వరాజ్

# ప్రాపర్టీ షో సక్సెస్

**'నమస్తే తెలంగాణ' - 'తెలంగాణ టుడే' ఎక్స్‌పో విజయవంతం**

- రెండు రోజులపాటు సూపర్ రెస్పాన్స్
- కిటకిటలాడిన రాజరాజేశ్వర కళ్యాణ మండపం
- వందలాదిగా తరలివచ్చిన సందర్శకులు
- స్టాల్స్‌ను సందర్శించిన ప్రముఖులు, ఉద్యోగులు
- హర్షం వ్యక్తం చేసిన రియల్ సంస్థల ప్రతినిధులు

ప్రాపర్టీ షో గ్రాండ్ సక్సెస్ అయింది. 'నమస్తే తెలంగాణ' —'తెలంగాణ టుడే' సంయుక్తంగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. రెండు రోజులపాటు వందలాది మందితో రాజరాజేశ్వర కళ్యాణ మండపం కిటకిటలాడింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిర్మాణ రంగ సంస్థలు, బ్యాంకులు స్టాళ్లు ఏర్పాటు చేయగా, సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్లాట్లు, ఫ్లాట్లు, ఇండ్లు, విల్లాల ధరలతోపాటు వ్యాపారాలు, భూములు, ఇండ్ల కొనుగోలుకు అందిస్తున్న రుణాల గురించి తెలుసుకున్నారు. అలాగే, సోలార్ విద్యుత్‌కు సంబంధించిన వివరాలను సేకరించారు. పలువురు నిర్మాణాలు, స్థలాల కోసం అడ్వాన్స్‌లు చెల్లించగా, స్పందనను చూసి వ్యాపార సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

కార్పొరేషన్, మార్చి 9: కరీంనగర్ జిల్లా కేంద్రంలో 'నమస్తే తెలంగాణ' – 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ప్రాపర్టీ షో ఏర్పాటు చేశారు. కోర్టు చౌరస్తా సమీపంలోని రాజరాజేశ్వర కళ్యాణ మండపంలో శని, ఆదివారాల్లో ఈ ఎక్స్‌పో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ రియల్ సంస్థలు, నిర్మాణ రంగానికి సంబంధించిన సోలార్, సిమెంట్, వుడ్‌కు సంబంధించిన సంస్థలు, రుణాలు అందించే బ్యాంకుల ప్రతినిధులు, బిల్డర్స్ స్టాళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు షో నిర్వహించగా, రెండు రోజుల్లో 1200కు పైగా సందర్శకులు స్టాళ్లను సందర్శించారు. సాయంత్రం సమయంలో కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. నిర్మాణ రంగ సంస్థల ఉత్పత్తులు, ప్రాజెక్టులు, వ్యయాలు, లోన్లు ఇతర వివరాలను తెలుసుకున్నారు. కొందరు ప్లాట్లు, అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను బుక్ చేసుకొని అడ్వాన్స్‌లు కూడా చెల్లించారు. ప్రజలతోపాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు కూడా వచ్చి స్టాళ్లను పరిశీలించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి ఆంజనేయులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బండ గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. రెండోరోజు షోను సందర్శించిన ప్రజలకు లక్కీ డ్రా ద్వారా ఐదుగురికి ఉచితంగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు, ఎడిషన్ ఇన్‌చార్జిలు ఐ సుభాష్, సంపత్, యాడ్స్ మేనేజర్ రేణ మల్లయ్య, నమస్తే తెలంగాణ సిబ్బంది పాల్గొన్నారు.



ఉస్మాని అసోసియేట్స్ ప్రతినిధి ఆరీఫ్ ఉస్మాని



వైష్ణవి గార్డెన్స్ విల్లాస్ ప్రతినిధి హనుమంతరావు



ఎడ్‌వన్సా సెంచూరీ అపార్ట్‌మెంట్స్ ప్రతినిధి వెంకటపతిశర్మ



సోనీ సోలార్ పవర్ ప్లాంట్ యజమాని ప్రశాంత్



సందర్శకులకు వివరిస్తూ..



### అన్నీ సరిచూసుకొనే కొనాలి

ఇంటి స్థలాలు, అపార్ట్‌మెంట్లలో ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో కొనుగోలుదారులు జాగ్రత్తలు తీసుకోవాలి. అన్ని అనుమతులు ఉంటేనే కొనాలి. ప్రభుత్వ నిబంధనలు పాటించారా..? లేదా అని సరిగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా చేస్తేనే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి. ముఖ్యంగా రియల్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. జిల్లాలోనూ రియల్ రంగం పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. అన్ని రియల్ సంస్థలు, నిర్మాణ రంగానికి అవసరమైన సంస్థలను ఒకే వేదిక పైకి తీసుకువచ్చిన నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇలాంటి వేదికతో కొనుగోలుదారులకు ఉన్న అనుమానాలన్నీ నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. రాబోయే రోజుల్లో మరిన్ని షోలు నిర్వహించాలి.

**- ఆంజనేయులు, డీటీసీపీ అధికారి**

### అభినందనీయం



ఇండ్ల స్థలాల సమాచారం, నిర్మాణ రంగంలో ఎదురయ్యే సమస్యలు, బ్యాంకు రుణాలు, వాటి వడ్డీ గురించి ప్రజలు తెలుసుకునేందుకు రియల్ సంస్థలు, బ్యాంకర్లను నమస్తే తెలంగాణ ఆధ్వర్యంలో ఒకే వేదిక మీదకు తీసుకురావడం అభినందనీయం. ఓపెన్ ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో వచ్చే వివిధ సందేహాలను ఇక్కడి స్టాళ్లలో అడిగి తెలుసుకోవచ్చు.

**- బండ గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు**

### ఒకే వేదికపైకి తేవడం అభినందనీయం



ఇంటి నిర్మాణ రంగం, ఇండ్ల స్థలాలకు సంబంధించి రాష్ట్రంలోని ప్రముఖ రియల్ సంస్థలన్నింటినీ ఒకే వేదిక పైకి తీసుకురావడం అభినందనీయం. ఆయా సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తమకు కావాల్సిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చు. అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, ఓపెన్ ప్లాట్ల ధరలు గురించి తెలుస్తుంది. జిల్లా ప్రజల సౌకర్యార్థం ఇలాంటి ప్రాపర్టీ షోలు మరిన్ని ఏర్పాటు చేయాలి.

**- వీర్ల వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు**




లక్కీ డ్రా విజేతలకు బహుమతి అందజేస్తున్న వీర్ల వెంకటేశ్వర్‌రావు

# వదలని పొగమంచు



మంచుతో కప్పేసిన కొలనూర్ రైల్వేస్టేషన్

ఓదెల, మార్చి 9: చలి ఇంకా వదలడం లేదు. మార్చి మొదటివారం దాటినా వణుకు తగ్గడం లేదు. పొద్దంత ఎండ దంచుతున్నా.. రాత్రివేళల్లో చలి వణికిస్తున్నది. దీనికి తోడు దట్టమైన మంచుదుప్పటి పరుచుకుంటున్నది. ఆదివారం తెల్లవారుజామున ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ పొగ మంచు కమ్మేసింది. 50మీటర్ల దూరంలో ఏదీ కనిపించనంతగా ఆవహించడంతో 'వామ్మో ఇదేం మంచు?' అంటూ ప్రజలు భయపడిపోయారు. రోడ్లపై వెళ్లే వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకొని నెమ్మదిగా వెళ్లారు. రైలు నడిపే లోకో పైలెట్లు సైతం సిగ్నల్స్ కనిపించక తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వేగాన్ని తగ్గించి నడిపించారు. వాతావరణంలో వచ్చిన మార్పులే ఇందుకు కారణమని పలువురు పేర్కొంటున్నారు.



బాబాయిచెరువుతండాలో వరిచేనును మేస్తున్న గొర్లు

# కోతకు రాకముందే మేతకు..

వీర్నపల్లిలో ఎండుతున్న పొలాలు



వన్‌పల్లిలో వరికి ట్యాంకర్‌తో నీళ్లు పడుతున్న రైతు

వీర్నపల్లి, మార్చి 9: వీర్నపల్లి మండలంలో సాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. బోర్లు, బావులు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయి. పదకొండేళ్ల క్రితం నాటి రోజులు మళ్లీ పునరావృతమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పుష్కలమైన నీటితో పసిడి పంటలు పండించిన రైతులు, కాంగ్రెస్ పాలనలో కన్నీరు పెడుతున్నారు. యాసంగి మొదట్లో చెరువులు, కుంటల్లో నీరు ఉండడంతో దండిగా వరి సాగు చేశారు. అయితే చెరువుల్లో నీరు లేక, కాలువల్లో రాక, బోర్లు, బావులు అడుగంటిపోయాయి. పొట్ట దశలో పంటలు ఎండిపోతుండడంతో కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అక్కడక్కడా ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్నారు. కొందరూ అప్పులు చేసి బోర్లు వేస్తున్నా ప్రయోజనం ఉండడం లేకపోవడంతో రైతన్న కంటతడి పెడుతున్నారు. మండలంలోని వన్‌పల్లి, రంగంపేట, బాబాయిచెరువుతండా, వన్‌పల్లిలో సుమారు 40ఎకరాలు ఎండిపోవడంతో చేసేదేం లేక పశువులకు మేతగా వదిలేస్తున్నారు.

### రెండు బోర్లు వేస్తే సుక్క నీరు రాలే..

మూడెకరాల్లో వరి వేసిన. ఉన్న రెండు బోర్లు వట్టిపోవడంతో నీళ్లు సరిగా వొస్తలేవు. పంట ఎండిపోతంది. ఏం చేయాల్నో అర్థమైతలేదు. చానా బాధైతంది. అప్పు జేసి మొన్న ఇంకో రెండు బోర్లు వేస్తే సుక్కనీరు రాలే. ఎకరం భూమి నీళ్లు లేక నెర్రలు వారింది. ఏం చేయాలో తెల్వక పంటను గొర్ల మేతకు వదిలి పెట్టిన. బోర్లలోంచి అచ్చే తడితో మిగిలిన రెండెకరాలు ఎల్లదీద్దమనుకుంటే పారుతలేదు. పెట్టుబడైనా అస్తదో రాదో. తెచ్చిన అప్పులెట్లా కట్టాల్నో తెలుస్తలేదు.

**- లాకవత్ లక్ష్మి, రైతు, రంగంపేట**





మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, పక్కన బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు

# రేవంత్ పాలనలో అరిగోస

- కాంగ్రెస్‌కు కాలం చెల్లింది
- ఎమ్మెల్యే కవ్వంపల్లివి నీచ రాజకీయాలు
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

మానకొండూర్, మార్చి 9: 'తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో భూమికి బరువైన పంటలు పండించిన రైతులు.. నేడు రేవంత్ పాలనలో అరిగోస పడుతున్నరు. రుణమాఫీ పూర్తిస్థాయిలో కాక, పెట్టుబడి సాయం అందక, సాగునీరు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నరు' అని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ మండిపడ్డారు. అసమర్థ పాలన సాగిస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు ఇక కాలం చెల్లిందంటూ ధ్వజమెత్తారు. మానకొండూర్ బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రసమయి మాట్లాడారు. రేవంత్ సర్కార్ పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. తీవ్ర నష్టాల్లో ఉన్న ఆర్టీసీని అభివృద్ధి పథంలోకి తీసుకురావడం చేతగాక ఎలక్ట్రిక్ బస్సుల పేరిట సంస్థను ప్రైవేట్‌పరం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. మహిళా సంఘాల వద్ద ఉన్న డబ్బులు వాడుకోవడానికే ఆ సంఘాలకు బస్సులు కేటాయిస్తున్నాడని ఆరోపించారు. మహిళలను కోటీశ్వరులను చేయడం ఏమో గానీ.. కూటికి లేని వారిగా మాత్రం చేయవద్దని సూచించారు. ముఖ్యమంత్రికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మేనిఫెస్టోలో మహిళలకు ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒంటెత్తు పోకడ ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం మరో ఆరు నెలలు గడువు పొడిగిస్తూ జీవో జారీ చేసిందని తెలిపారు. కానీ, నియోజకవర్గంలో 12సొసైటీలు ఉంటే అందులో ఏడు సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జీవోను పట్టించుకోకుండా అధికారులను బెదిరింపులకు గురిచేస్తూ కవ్వంపల్లి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. కమీషన్ల కోసం సొసైటీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవుపలికారు. సొసైటీ చైర్మన్లను వేధిస్తున్న కవ్వంపల్లిపై త్వరలో వ్యవసాయశాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజక కన్వీనర్ గుర్రం కిరణ్‌గౌడ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, దండబోయిన శేఖర్, నెల్లి శంకర్, గట్టయ్య, కముటం సంపత్, కొట్టె రఘు, తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్: సంబరాల్లో యువకులు

## జయహో భారత్

ఐసీసీ ఛాంపియన్ ట్రోఫీ ఫైనల్‌లో భారత్ గెలుపుపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అభిమానులు సంబురాలు జరుపుకొన్నారు. ఆదివారం దుబాయ్‌లో జరిగిన ఉత్కంఠ పోరులో న్యూజిలాండ్‌పై 4 వికెట్ల తేడాతో విజయం సాధించి, ట్రోఫీ కైవసం చేసుకోగా, పటాకులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు. జయహో భారత్ నినాదాలతో హోరెత్తించారు. **– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**